

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**ఇండియాలో కేంటిన్‌లా** కాక చాలా పెద్ద హాలులో ఎన్నో చిన్న రెస్టారెంట్‌లు ఉన్నాయి.

"ఇదే కేఫెటీరియా" హనీష చెప్పింది. కొంచెం లోపలికి నడిచాక "ఇక్కడ పని చేసే వాళ్ళందరూ స్టూడెంట్సే. నువ్వు కూడా ఇక్కడ జాబ్ అప్లై చెయ్యాలి. ఆన్ కేంపస్ జాబ్స్ చాలా తక్కువ ఉంటాయి, ఎక్కువమంది అప్లై చేస్తారు."

పిజ్జా హట్ దగ్గర ఆగాం.

"హౌ కెన్ ఐ హెల్ప్ యు?" అక్కడ పని చేస్తున్న అబ్బాయి అడిగాడు.

"ఐ వాంటు టు బ్రెడ్ స్టిక్స్, ఒన్ వెజ్ పిజ్జా, ఒన్ చికెన్ పిజ్జా, టు సెన్‌మన్ రోల్స్, టు కోక్, టు వాటర్ అండ్ టు బ్రౌనీ" అంది.

"నాకు ఆకలిగా లేదు" అంత ఆర్డర్ విని ఆశ్చర్యపోతూ అన్నాను.

"ఫర్ హియర్ ఆర్ టుగో?" అడిగాడతను.

"ఫర్ హియర్"

"టూ హండ్రెడ్ అండ్ థర్టీ డాలర్స్" అతను చెప్పడం విని ఆశ్చర్యపోయాను.

"డిస్కౌంట్?"

"టూ పర్సెంట్."

"ఆర్డర్ కాన్సిల్"

"టూ లేట్ ఆర్డర్ ఇన్ ప్రాసెస్."

"ఐ వోంట్ పే"

"యూ హేవ్ టు మామ్?"

"వై?"

"బికాస్ యు ఆర్డర్డ్"

"బట్ ఐ డిడ్ నాట్ ఈట్."

ఎందుకొచ్చిన గోల అని "నేను పే చేస్తా" నెమ్మదిగా హనీషతో చెప్పాను.

"మేమ్. యుర్ ఆర్డర్ ఈజ్ ఇన్ ది అవెన్, వీ కెనాట్ కేన్సిల్ నౌ. యూ హేవ్ టు పే ఆర్ వీ విల్ కాల్ సెక్యూరిటీ" అన్నాడు. నేను భయపడిపోయాను.

హనీష మాత్రం "ఈజ్ ఇట్.. బికాస్ షి ఈజ్ న్యూ స్టూడెంట్" నన్ను చూపిస్తూ అడిగింది. ఇద్దరూ మాటల యుద్ధం ఆపి నన్ను చూడసాగారు.

ఏం మాట్లాడాలో ఏమనాలో తెలీక ఇబ్బంది పడుతుండగా ఇద్దరూ ఫక్కున నవ్వారు.

" తను అవని. మా ఇంట్లో టెంపరరీ అకామడేషన్‌కి వచ్చింది. అవని తను పవన్. నా ఫ్రెండ్ ఇక్కడ పనిచేస్తాడు" వివరించింది.

"ఓ ఔనా. హాయ్ పవన్. నేను నిజంగా కొట్టుకుంటున్నారని భయపడిపోయాను" అన్నాను.

"నిన్ను చూస్తే జాలేసింది కానీ ఈ దెయ్యం ఎంతసేపు నడుస్తుందో అని చూసాను. సారీ"

"పరవాలేదు" నవ్వాను.

"నువ్వేనా ఏరోస్పేస్?"

"ఔను"

"మీ అన్నయ్య దగ్గరకాకుండా ఇక్కడికెందుకొచ్చావు?"

"నీకు మా అన్నయ్య తెలుసా?"

"లేదు చెపితే విన్నాను."

"మా అన్నయ్య గురించా? ఎవరు చెప్పారు?"

"నిన్ను ఎయిర్‌పోర్ట్ నించి తెచ్చిన వాళ్ళు. అయినా తెలుగురానట్టు నటించి భలే భయపెట్టావు వాళ్ళని" అన్నాడు.

"ఇక్కడ అన్నీ అంతే. ఒక్కళ్ళకి చెపితే ఊరంతా పాకిపోతుంది" హనీష చెప్పింది.

"కొన్ని చెప్పకపోయినా పాకిపోతాయి" అన్నాడు.

"అంటే?" అర్ధంకాక అడిగాను.

"నీకే తెలుస్తుందిలే. హే, సారీ ఇందాక చాలా భయపడినట్టు ఉన్నావు. నిజంగా సారీ" పవన్ అన్నాడు.

"ఫరవాలేదు. సారీ అక్కరలేదులే"

"నీ షిఫ్ట్ అయ్యాక మెసేజ్ చెయ్యి. తనని మనవాళ్ళకి పరిచయం చేస్తున్నాను" హనీష అనడంతో ముగ్గురం బాయ్ చెప్పుకున్నాం.

"ఏరో స్పేస్ అబ్బాయి ఒకతను చిక్‌ఫిలేలో పనిచేస్తాడు. తనని పరిచయం చేస్తా" అటువైపుగా నడిచాం.

"హే, హనీషా" దూరం నుండి ఎవరో పిలిచారు.

"హాయ్, ఎప్పుడొచ్చావు?" హనీష అడిగింది.

"నిన్న రాత్రి వచ్చా. నువ్వు ఎక్కడికీ వెళ్ళలేదా సమ్మర్?"

"లేదు. నేను ఒక కోర్స్ తీసుకున్నా."

"ఔను. చెప్పావు కదా. మర్చిపోయా."

"ఎలా అయ్యింది ట్రిప్?"

"బానే అయ్యింది. సగం రోజులు నాకు జ్వరం. కానీ మిగిలింది బాగా ఎంజాయ్ చేసాను."

"ఏమైంది?"

"జలుబు, దగ్గు."

"అంతేనా?" పెద్దగా నవ్వింది హనీష.

"నీకేం తెలుసు నేను పడిన పాట్లు. మళ్ళీ వెళ్ళాలి. అన్నీ కవర్ చెయ్యలేకపోయాను."

"ఈసారి నువ్వు వెళ్ళినప్పుడు నేను కూడా వస్తాను. బై ద వే, తను అవని. మా టెంపరరీ రూం మేట్" పరిచయం చేసింది.

"హాయ్, ఐయాం అనూష" అంది.

"తెలుగు వచ్చు తనకి" హనీష బదులిచ్చింది.

"ఓ..ఔనా. నేనింక తెలుగు రాదనుకున్నా. సరే. తరువాత కలుద్దాం. లైబ్రరీలో పనుంది" ముగ్గురం బాయ్ చెప్పుకున్నాం.

"నువ్వు తెలుగులోనే పరిచయం చేసావుగా. మళ్ళీ తెలుగొచ్చా అని ఎందుకు ఆశ్చర్యపోయింది?" అడిగాను.

"తను అంతే పట్టించుకోకు"

"ఎక్కడికి వెళ్ళింది సమ్మర్‌లో?" అడిగాను.

"ఏమో తెలీదు. ఏదో చెప్పింది కానీ మర్చిపోయాను. మాటల్లో చెప్తుందనుకున్నా కానీ చెప్పలేదు" ఇద్దరం నవ్వాము.

"ఈజ్ అనీష్ హియర్?" అక్కడ పనిచేస్తున్న అమ్మాయిని అడిగింది.

"హి కమ్స్ ఇన్ ఎట్ వన్"

"ఓ. ఓకే" అంది.

నా వైపు తిరిగి "అనీష్ ఆఫ్టర్ నూన్ షిఫ్ట్ అనుకుంటా. కొంచెం సేపు వెయిట్ చేద్దామా?" అడిగింది.

"యా. చేద్దాం" అన్నాను.

పక్కనే ఉన్న టేబుల్ దగ్గర కూర్చున్నాం.

"అనీష్‌కి మెసేజ్ చేసా, టెన్‌మినిట్స్‌లో వస్తాడట" అంది.

"ఓకే, వాళ్ళందరూ నీ ఫ్రెండ్సా?"

"ఫ్రెండ్స్ అంటే తెలుసు. అంతే. మరీ చెప్పుకునేంత ఫ్రెండ్స్ కాదు. ఇక్కడ అందరూ అందరికి పరిచయం ఉంటారు. 'హాయ్' 'బాయ్' టైప్స్. కానీ అవసరమైతే హెల్ప్ చేస్తారు. ఎట్ లీస్ట్ నాకు తెలిసినవాళ్ళు. అలా అని ఎవరినీ నమ్మకూడదు. ఓ రకంగా ఎంత దూరం పెడితే అంత మంచిది. మరో రకంగా అవసరం కోసం కొంచెం స్నేహంగా ఉండాలి"

తన ఉద్దేశం అర్థంకాక తలూపాను.

"నీకే అర్థమౌతుందిలే, ఏది ఏమైనా జాగ్రత్త. కొంతమంది చాలా ఫ్రెండ్లీగా ఏదో నువ్వే బెస్ట్ ఫ్రెండ్, నువ్వు తప్ప ప్రపంచంలో ఎవరూ లేరులా చేస్తారు. కానీ వాళ్ళంత డేంజరస్ ఎవరూ ఉండరు. నీకు ఇండియాలో కూడా ఇలాంటి వాళ్ళు పరిచయం అయి ఉంటారు. ఇక్కడ ఎక్కువ క్వాంటిటీలో ఉంటారు అంతే తేడా" అంది.

నేను ఏదో చెప్పబోతుండగా, "అన్నిటికన్నా ఇంపార్టెంట్, ఇక్కడ కాస్ట్ ఫీలింగ్ చాలా ఎక్కువ. కాస్ట్ వల్ల గొడవలు, పోట్లాటలు చాలా జరిగాయి. అలాంటి మాటలు ఎవరైనా చెప్పినా, అటువైపుకి సంభాషణ వెళ్ళినా, వెంటనే కట్ చెయ్యి. ఒక్కసారి అటువేపు వెళితే మళ్ళీ కష్టం. మిగిలిన వాళ్ళు స్నేహం చెయ్యరు."

బిత్తరపోయి "కాస్ట్ గొడవలా?" అడిగాను.

"ఔను. కానీ నువ్వు నీ పని చేసుకుని ఎవరిని ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచితే సరిపోతుంది. భయపడకు. ఎవరు డేంజరసో నేను నీకు ముందే చెప్తా" కన్నుకొట్టింది.

"సరే. థాంక్స్" అని ఎలాంటి చోటికి వచ్చి పడ్డానురా భగవంతుడా అనుకున్నాను. ఈ విషయంలో అన్నయ్య సలహా కూడా తీసుకోవడం మంచిదనిపించింది.

"హాయ్ హనీష, ఆర్ యు అవని?" ఓ అబ్బాయి మావైపు వచ్చాడు.

"తెలుగమ్మాయే" హనీష అంది.

"ఓ ఔను. ఇంకేం నేనూ తెలుగే. ఐ యాం అనీష్" అన్నాడు.

కళ్ళజోడు పెట్టుకుని చూడ్డానికి బాగా చదివే అబ్బాయిలా ఉన్నాడు.

"హాయ్" ఇంకేమనాలో తెలియక హనీష కేసి చూసాను.

"నేనూ తెలుగే అని ఐ యాం అనీష్ ఏంటి? నా పేరు అనీష్ అనలేవా?" వెటకారంగా అంది.

"నువ్వు ఏరో స్పేసా?" అడిగాడు.

"ఔను" బదులిచ్చాను.

"నేనూ ఏరో స్పేస్. ఒక్క నిమిషం ఆగు. నేను క్లాకిన్ అయ్యి వస్తా" రెస్టారెంట్‌లోకి వెళ్ళాడు.

"అనీష్ మంచివాడే తనతో ఏ గొడవా ఉండదు. నార్మల్‌గా మాట్లాడొచ్చు" అంది హనీష.

ఈ నార్మల్, అబ్నార్మల్ గోలేంటో అని భయం మొదలైంది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story